# జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానం అమలుకావాలి




జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

**కాకినాడ.పెన్ పవర్ జూలై 6 :**జిల్లాలో ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక పంపిణీ విధానం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికరులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో ఉచిత ఇసుక పంపిణీ విధానంపై శనివారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దాపురం స్టాక్ పాయింట్ వద్ద ఇసుక రూ.655 గా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద నుండి వినియోగదారులు రవాణా చార్జీలు భరించి ఇసుకను తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచాలని అన్నారు. ఉదయం 06.00గం.ల నుంచి సాయంత్రం 06.00గం.ల వరకు ఇసుక రవాణా కావాలని స్పష్టం చేశారు. ఇసుక సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ వద్ద రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇసుక సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆన్ లైన్ ద్వారానే వినియోగదారుడు చెల్లింపులు చేయాలని, ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను బట్టి సరఫరాకు ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఇసుక రీచులతో పాటు కొత్త ఇసుక రీచులను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇసుక రవాణాకు అవసరమైన ఇంటర్నల్, కన్స్యూమర్ పెర్మిట్ ల విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలన్నారు. తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరాబ్ కుమార్ ప్రసాద్ శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి నూతన ఇసుక విధానం, ఇసుక స్టాక్ పాయింట్లు, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి..జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, జిల్లా గనుల శాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. జూలై 8 నుంచి ఉచిత ఇసుక సరఫరా విధానం ప్రారంభం, ఇందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ గా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఏర్పాటు, ధరలను నిర్ణయం వంటి అంశాలపై కలెక్టర్లకు సిఎస్ నీరాబ్ కుమార్ ప్రసాద్ దిశనుద్దేశం చేశారు.సమావేశంలో గనుల శాఖ డీడీ నరసింహారెడ్డి, ఎస్ఈ బీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, పెద్దాపురం ఆర్డీవో జె .సీతారామారావు, ఆర్డీవో మురళి , పోలీస్ అధికారులు, తదితరులు హాజయ్యారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా။ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దురదృష్టకరం





-నిందుతులను త్వరలో పోలీసులు బయటపెడతారు
-దోషులు ఏపార్టీవారైనా కఠిన చర్యలు తప్పవు
-అంతా సంయమనం పాఠించండి
-మంత్రి సుభాష్ వెల్లడి

**కాజులూరు,పెన్‌పవర్, జూలై6:**రామచంద్రపురం వెల్లగ్రామంలో గురువారం రాత్రి భారతరత్న డాక్టర్ బిఆర్అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం చాలా దురదృష్టకం అని రాష్ట్ర కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.శనివారం మంత్రి సుభాష్ వెల్లగ్రామంలోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు.ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులు ఏ పార్టీకి చెందినా ఉపేక్షించేదిలేదని మంత్రి స్పష్టం చేశారు.భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను రేపటిలోగా పోలీసులు కోర్టుకు అప్పగించేందుకు సిద్ధంగ ఉన్నారన్నారు.ఎవరైనా కోర్టు విధించే కఠిన శిక్ష భరించాల్సిందే అని మంత్రి గుర్తుచేశారు.ఇటీవల ఎర్రపోతవరంలో జరిగిన ఘటన కానివ్వడం,మండపేటలో జరిగిన ఘటన కానివ్వండి ,అలాగే రాజమండ్రిలో భరత్ కారు తగలపడిపోయిన ఘటనలో కూడా వైసీపీ నేతల హస్తం ఉందని మంత్రి వివరించారు.వెల్లగ్రామంలో జరిగిన ఘటనపై కూడా పోలీసులు పూర్తి వివరాలు తెలిపేందుకు పోలీసువారు ముమ్మర దర్యాప్తు ప్రారంభించడం జరిగిందన్నారు. అసలు దోషులు ఎవరనేది పోలీసులు రేపటిలోగా అసలు విషయాలు బటపెట్టనున్నారు ,అంతవరకు మీరెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి పేర్కొన్నారు.వెల్లగ్రామం అంటే ఇక్కడ ఉన్న అన్నివర్గాల వారు అన్నదమ్ములవలే ఉంటారన్నారు. ఇలాంటి ఘటనలు ఎప్పుడు చోటుచేసుకోలేదని మంత్రి తెలిపారు.అలాగే అరుంధతిపేటలో అంబేద్కర్,జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు సంబంధించిన స్థలం కొంతమేర కబ్జాకు గురైందని స్థానిక దళిత నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆ స్థలాన్ని ఆయన పరిశీలించారు.పోలీసులు కూడా ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పుటు నిందితులను పట్టుకోవడంలో పోలీసులు చురుకైన పాత్రపోషించడం అభినందనీయం అన్నారు. పోలీసులు పూర్తి వివరాలతో నిందితులను కోర్టుకు అప్పగించిన వెంటనే,స్థానికి తహశీల్దారు,సర్వేయర్ సమక్షంలో ఆక్రమణకు గురైన భూమిన సర్వేచేసి ఆ సంఘానికి అప్పగించడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే అదేరోజు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరుగుతుందని మంత్రి దళిత నేతలకు పూర్తి భరోసా ఇవ్వడంతో గ్రామంలోని ధళిత నాయకులు, ప్రజా సంఘాల నాయకులు,మాలల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.ప్రభుత్వ అధికారుల సమక్షంలో నూతన విగ్రహ ఏర్పాటు జరుగుతుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి హామీ ఇచ్చారు.గ్రామంలో మీరెవరూ రోడ్డు ఎక్కాల్సిన పనిలేదని, మీకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని సుభాష్ అన్నారు.ఆయన తోపాటు డిఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్‌బాబు,దళితనేతలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం చిట్ట చివరి స్థాయికి అందించేందుకు సంపూర్ణత అభియాన్

- దేశంలోఎంపికైన 112 జిల్లాలలో మన జిల్లా ఉండటం అదృష్టం
- జిల్లాలో వై.రామవరం, గంగవరం,మారేడుమిల్లి ఎంపిక
- జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్




**గంగవరం /పాడేరు,పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్,జూలై 06:** అభివృద్ధి సంక్షేమ ఫలాలు చిట్ట చివరి స్థాయి వరకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంపూర్ణత అభియాన్ పథకం ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు.కలెక్టరేట్ లో శనివారం సంపూర్ణత అభియాన్ పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ను ఏర్పాటు చేసి దేశంలో ఎంపిక చేసిన 112 జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాను కూడా ఎంపిక చేయడం హర్షనీయమన్నారు.(రాష్ట్రంలో అల్లూరి,పార్వతీపురం,కడప జిల్లాలు మాత్రమె). అదేవిధంగా దేశంలో 500 బ్లాకులు ఎంపిక కాగా జిల్లాలో వై.రామవరం,గంగవరం, మారేడుమిల్లి మండలాలను ఎంపిక చేసిందన్నారు. (రాష్టంలో15 మండలాలు మాత్రమె).ముఖ్యంగా ఆరోగ్యం, పౌష్టికాహారంబీ వ్యవసాయ అనుబంధ శాఖలుబీ విద్యబీ మౌళిక సదుపాయాలు మొదలగు సూచికలలో ప్రగతి గుర్తించి ర్యాంకులు కేటాయిస్తారని వివరించారు.ఆయా శాఖల అధికారులు నిర్దేశిత ప్రజల వరకు ఫలాలు తీసుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఇండికేటర్స్ లో ప్రగతి మేరకు నీతి అయోగ్ నుండి నిధులు నేరుగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు.గ్రామ సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పూర్తి భాగస్వామ్యం కావాలని ఆదేశించారు.ఆరోగ్య క్రమశిక్షణలో భాగంగా యుక్త వయసు మహిళలను నిర్ణీత వయసు నిండాక మాత్రమె వివాహం చేసుకొనేలా చూడాలని,గర్భం దాల్చడానికి ఆరోగ్యపరంగా అనుకూలంగా ఉండేలా చూడాలని, గర్భం దాల్చిన నాటినుండి బిడ్డ పుట్టి ఏడాది వరకు వారి ఆరోగ్య స్థితిగతులు ట్రాక్ చేసే విధంగా జిల్లా వైద్య ఆరోగ్యాధికారి, ఐసిడిఎస్ పిడి భాద్యత వహించాలని,వారికి అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా వారికి అందించే పౌష్టికాహారంతో పాటు స్థానికంగా లభ్యమయ్యే పౌష్టికాహారాలైన ఆకు కూరలు, మునగాకు,దుంపలు లాంటివి తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు.వారికి అందిస్తున్న బాల సంజీవిని కిట్స్,పౌష్టికాహారాన్ని వారు తీసుకు0టున్నదీ లేనిదీ పర్యవేక్షి0చాలన్నారు. ఆసుపత్రుల ప్రసవాలను ప్రోత్సహించాలని, ప్రసవం తరువాత బిడ్డలకు నిర్ణీత సమయం ప్రకారం ఇమ్యునైజేషన్ అందించాలని సూచించారు.పిల్లలను పాఠశాలల కంటే ముందు అంగన్వాడిలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

-4 లో

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపేట: మంత్రి నిమ్మల

## సర్కార్ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి




**పోడూరు, పెన్ పవర్ జూలై-06:** సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను అగ్రస్థానంలో ఉంచాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పాలకొల్లు ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు బి ఆర్ ఎం ఉన్నత పాఠశాలలో మాజీ శాసన మండలి సభ్యుడు అంగర రామ్మోహన్ రావుతో కలసి ఆయన విద్యార్థులకు 'స్టూడెంట్స్ కిట్స్ 'పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య తోనే ప్రగతి సాధ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు తమ సొంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్స్ ను విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అద్దేపల్లి సేవలు అజరామం: కేంద్రమంత్రి వర్మ

125వ జయంతి వేడుకల్లో హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు వర్మ, నిమ్మల




**పోడూరు, పెన్ పవర్, జులై-06:** స్వాతంత్ర్య సమరయోధుడిగా, విద్యా ప్రధాతగా, నిస్వార్ధ ప్రజాసేవకుడిగా, ఎమ్మెల్యేగా అందరి మన్ననలు పొందిన అద్దేపల్లి సేవలు అజరామమని కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పాలకొల్లులో శనివారం అద్దేపల్లి సత్యనారాయణమూర్తి 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొల్లులో విద్య సంస్థల ఉన్నతికి ఆయన చేసిన సేవను స్ఫూర్తిగా తీసుకొని విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణ అభివృద్ధికి పాలకొల్లు శాసనసభ్యుడు, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ప్రగతికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు - మాట్లాడుతూ జాతిపిత గాంధీజీ పాలకొల్లుకు విచ్చేసినప్పుడు ఆయన ఇంట బస చేయడమే అద్దేపల్లి సేవా భావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. సమాజసేవ, అభ్యుదయభావం కలిగిన మహనీయుడు సత్యనారాయణమూర్తి అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహనరావు మాట్లాడుతూ ఆయన అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన జయంతి వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ధర్మారావు పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 96వ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కల నాటే కార్యక్రమాలను నిర్వహించారు. సందేశాత్మక సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# ప్రతి నెలా మొదటి రోజే పింఛన్లు పంపిణీ జరగాలి.

- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్ జూలై 6:** ఇటీవల పెంచిన సామాజిక భద్రత పింఛన్లను ప్రతి నెల మొదటి రోజే నూటికి నూరు శాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికా రులను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు శనివారం జిల్లాలోని ఎంపీడీవోలు తాసిల్దారులతో స్థానిక కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా పారదర్శ కంగా జవాబుదారితనంతో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా చేపట్టిం దని ఈ ప్రక్రియలో ఇబ్బందులు సమ స్యలు తలెత్తయా అన్న విషయాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీడీవోలు మాట్లాడుతూ ఇటీవల లబ్ధిదా రులలో కొంతమంది మరణించిన మూలంగా నూటికి నూరు శాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిర్వహించ లేకపోయామని అదేవిధంగా ఈ నెల ఒకటి రెండు తేదీలలో లబ్ధిదారులు కొంతమంది తమ సొంత గ్రామాలలో ఇంటి వద్ద నివాసం ఉండకపోవడం వల్ల కూడా పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగిందని వారు జిల్లా కలెక్టర్ వారికి తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం నిర్దేశించిన 50 లబ్ధి దారులకు మించకుండా మ్యాపింగ్ ప్రక్రియ సచివాలయ డిజిటల్ సహాయకుల ద్వారా ద్వారా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలకు సూచించారు. సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారులు ప్రతి నెల ఒకటో రెండు తేదీలలో తప్పనిసరిగా లబ్ధిదారులు తమ స్వగ్రామాలలో ఇంటి వద్ద ఉండేలా అవగాహన పెంపొం దించాలని ఆయన ఎంపీడీవోలను ఆదేశించారు ప్రతినెల ఆఖరి తేదీ నగదు బ్యాంకుల నుండి నగదు విత్ డ్రా చేసే సమయంలో ఎంపీడీవోలకు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, బ్యాంకు మేనేజర్లు తమ వంతు సహకారం అందించి భద్రత నడుమ పంపిణీ ప్రక్రియ సజావుగా పూర్త య్యేందుకు సహకరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి శివశంకర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# డిగ్రీ కాలేజీలో సైంటిఫిక్ వర్క్ షాప్ గూర్చి స్పార్క్ తో ఒప్పందం.




**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో స్పార్క్ సంస్థ సైంటిఫిక్ వర్క్ షాప్ నిర్వహించుకోవడానికి ఒప్పందం కుదిరినట్లు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డి సునీత శనివారం తెలిపారు. ఈ ఒప్పందాన్ని అనుసరించి డిగ్రీ కాలేజీలో స్పార్క్ సంస్థ ఇంక్యులేషన్ హబ్ ఏర్పాటుచేసి విద్యార్థులలో స్కిల్ డెవలప్మెంట్ , స్టార్టప్ ఈకో సిస్టంలో విద్యార్థులకు సహాయ పడనుందని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి ఇస్రో భాగస్వామి స్పార్క్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించడానికి ఇంటర్నషిప్ ఏర్పాటు లోను, ఇండస్ట్రియల్ కనెక్ట్ లోను, గ్లోబల్ రీసెర్చ్ సర్టిఫికెట్, వర్క్ షాప్ ల నిర్వహణ సహాయ సహకారాలు విద్యార్థులకు స్పార్క్ సంస్థ అందజేస్తుందని ఆ సంస్థ సీఈవో సాయి సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ సంస్థ డైరెక్టర్ రవి కరణ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు, కాలేజ్ అధ్యాపకులు డాక్టర్ ప్రయాగమూర్తి ప్రగడ, కె సురేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లిలో ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, జూలై 6:** ఉచిత రాబిస్ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు .శనివారం జీలుగుమిల్లిలో ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులనుండి మనుషులకు మనుషుల నుండి పశువులకు సోకే వ్యాధులు ఉన్నాయని అన్నారు .ఈ సంక్రమిత వ్యాధుల పట్ల సాంఘిక ఆర్థికంగా పరిస్థితులు దెబ్బతింటాయని అన్నారు. కనుక టీకాలు తప్పనిసరిగా వేయాలని అన్నారు. జీలుగుమిల్లిలో నూతన పశు వైద్యశాల నిర్మాణానికి ఉన్నత అధికారులతో మాట్లాడతానని అన్నారు. జీలుగుమిల్లి మండలంలో ని సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు .పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సాయిబుచ్చారావు మాట్లాడుతూ జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో మొత్తం 4 75 డోసులు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు .అనంతరం ఎమ్మెల్యే సిరి బాలరాజుని వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సర్పంచ్ సిరి జగదాంబ, ఉభయగోదావరి జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ,జీలుగుమిల్లి మండల టిడిపి అధ్యక్షులు సుంకవల్లి సాయి ,జీలుగుమిల్లి మండలం జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము ,వైద్య అధికారిని జే లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది ఏ సత్యనారాయణ, భవాని ,రైతులు పాల్గొన్నారు.

## 86 రేబీస్ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ




**పోడూరు, పెన్ పవర్, జులై 6:**
పోడూరు మండలంలో 86 పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేసినట్లు పోడూరు ప్రాంతీయ పశు వైద్య శాల సహాయ సంచాలకుడు జయకర్ జాన్సన్ తెలిపారు. మండలంలో శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పోడూరు, పండిత విల్లూరు, పెనుమదం, జిన్నూరు, కవిటం, కొమ్ము చిక్కాల పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి ఎస్ మహేష్ కుమార్ మాట్లాడుతూ సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం ఈ టీకాలను ఉచితంగా అందిస్తుందన్నారు. పెంపుడు కుక్కలకు ఈ టీకాలు వేయడం ద్వారా జంతువుల నుండి మనుషులకు, జంతువులను జంతువులకు వ్యాధులను ప్రబలకుండా నివారించవచ్చు అన్నారు. మండలంలోని అన్ని పశువైద్యశాలల్లో ఈ టీకాలు అందుబాటులో ఉంటాయని, మరో వారం రోజులు పాటు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీహెచ్ఎలు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు

## తాళ్ళపూడి సచివాలయంలో డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 6:**భారత మాజీ ఉపప్రధాని డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని తాళ్ళపూడి సచివాలయం నందు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సిహెచ్ ఆశా ఆలేఖ్య జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆశా ఆలేఖ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే రాజకీయాల్లో ప్రవేశించి, స్వాతంత్ర్య సమర యోధుడిగా అనేక పోరాటాల్లో పాల్గొని, కేంద్రంలో తొలి కార్మిక శాఖ మంత్రిగా పనిచేయడంతో పాటు కేంద్రంలో విభిన్న శాఖల్లో మంత్రిగా నిజాయితీగా పనిచేసి కీర్తి గడించిన జగ్జీవన్ రామ్ ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, జూనియర్ అసిస్టెంట్ లీమా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అంజిబాబు, వెంకట్, ఏఎన్ఎం స్వర్ణలత, అగ్రికల్చర్ అసిస్టెంట్ రేవతి, మహిళా సంరక్షణ కార్యదర్శి సంధ్య, పంచాయతీ సిబ్బంది రాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.ద

## బాలింతలకు పండ్లు పంపిణీ చేసిన మానవతా సేవ సంస్థ



**పెనుమంట్ర, పెన్ పవర్,జూలై- 06:**ఆచంట మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు బేబీ కిట్స్, పండ్లు, మందులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా మానవతా ఆచంట మండల శాఖ అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాదు మాట్లాడుతూ బాలింతలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానవతా ఆడిట్ కమిటీ మెంబర్ నెక్కంటి శివన్నారాయణ, ఛైర్మన్ నంబూరి అంజిబాబు, కో-చైర్మన్ వేంద్ర శ్రీనివాస్, ఆత్మీయ సహకార కమిటీ మెంబర్ మయూరి శర్మ, ఉపాధ్యక్షులు బొక్కా రామకృష్ణ, కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శి మానేపల్లి వెంకటేశ్వర రావు, ఫిజియోథెరపిస్ట్ కె. యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా ముఖర్జీ జయంతి

**రంగంపేట, పెన్ పవర్, జులై 06:**భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని జి. దొంతమూరు గ్రామంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి సోడసాని ప్రసాద్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కొబ్బరి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి సోడసాని ప్రసాద్,మండలం బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి వీరబాబు, దుప్పలపూడి సుబ్రహ్మణ్యం,మాచిపిల్లి నాగేశ్వరరావు, నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మేడిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## వడిశలేరులో పెంపుడు జంతువులకు ఉచిత టీకా



**రంగంపేట, పెన్ పవర్, జులై 06:**ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా పెంపుడు జంతువులు ఉచిత టీకాలు వేస్తారు.శనివారం మండలంలోని వడిశలేరు గ్రామంలో ప్రభుత్వ పశువైద్యశాల నందు పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాధి నివారణకు పశు వైద్య అధికారి డాక్టర్ ఈ.జాన్ పాల్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులకు దూరంగా ఉండేందుకు ప్రజలు, పెంపుడు జంతువుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పశువుల నుంచి మనుషులకు వచ్చే రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమని అన్నారు. జంతువుల నుండి మనుషులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందని, వ్యాధి నివారణకై పెంపుడు జంతువులకు టీకా వేయించాలని సూచించారు. పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885 జూలై 6న లూయా పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా వ్యాధి నిరోధక టేకా ఇచ్చారని,విజయవంతం కావడంతో ఆ రోజును ప్రపంచ జునోసిస్ దినోత్సవం గా జరుపుకుంటున్నట్లు జాన్ పాల్ తెలిపారు.

## బస్సు ఢీకొని ఆవు మృతి



**వైరామవరం,పెన్ పవర్, జూలై 6 :** శుక్రవారం రాత్రి పనసల పాలెం గ్రామం వద్ద బస్సు ఢీకొట్టడంతో ఆవు మృతి చెందిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఏజెన్సీలో వేసవిలో పశువులను కాపు కాయకపోవడంతో రహదారుల పైనే ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయని పలువురు అంటున్నారు. అదేవిధంగా శుక్రవారం రాత్రి ఏలేశ్వరం నుండి వై. రామవరం నైట్ హాల్ట్ బస్సు రోడ్డుపై ఉన్న పశువులను తప్పించబోయి, ఒక పశువును ఢీకొట్టడం జరిగిందని తెలిపారు. బస్సు ఎడమవైపు ఉన్న ఆవు కనిపించకపోవడంతో ఢీ కొట్టారని, పశువు అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. రహదారులపై పశువులు ఆవాసాలు, పట్టించుకోని అధికారులు అనే శీర్షికన పెన్ పవర్ దినపత్రికలో పలు కథనాలు వచ్చిన అధికారులు స్పందించక పోవడం విశేషం. అదే విధంగా రైతులు కూడా పశువులను కట్టుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పరువులు కోరుతున్నారు.

## బిళ్లగుంటలో జగజ్జీవన్ రామ్ వర్ధంతి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై :**దళితులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళింగ లక్ష్మణరావు అన్నారు. పెంటపాడు మండలం బిళ్లగుంట గ్రామంలో జగజ్జీవన్ రామ్ వర్ధంతి శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి కళింగ లక్ష్మణరావు, ఉండ్రాజ వరపు రాజు పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమర యోధుడని,గొప్ప సంఘసంస్కర్త, రాజకీయవేత్త, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కొరకు పోరాడిన పోరాట యోధుడు అని కొనియాడారు. 50 సంవత్సరాల పాటు రాజకీయంలో కొనసాగారని, అతి చిన్న వయసులోనే న్యాయశాఖ, కార్మిక శాఖ, రక్షణ శాఖ, వ్యవసాయం, ఎన్నో పదవులు చేపట్టి వాటికి వన్నెతెచ్చారన్నారు. ఇండో, పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా ఆయన నిర్ణయాలు ఫలించాయని తెలిపారు . ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పాటుకు సుగమం అయిందని అన్నారు. భారతదేశంలో కరువు సమయంలో, ఆహార సంక్షోభాన్ని నివారించడానికి హరిత విప్లవం తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో యజ్జల రామారావు, కిల్లాడి రామయ్య, మోర్చ రాజేష్, యందం శ్రీనివాస్, పండు, కిషోర్, చిన్న బాబు, వెంకన్న, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం



**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 6:** ప్రక్కిలంక గ్రామంలో నివాసం ఉంటున్న దేవరపల్లి రాము కుమారుడు జోసెఫ్ 5వ తరగతి చదువుతున్నాడు. జోసెఫ్ బాబు బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న కారణంగా ఆ కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున 6 వేల రూపాయలు అందజేయడం జరిగిందని సంస్థ అధ్యక్షులు అంకెం సురేష్ తెలియజేశారు. వీటితో పాటు సనపల రాజశేఖర్ వెయ్యి రూపాయలు, గంధం మునేశ్వరరావు వెయ్యి రూపాయలు, కన్నెం సుబ్రహ్మణ్యం వెయ్యి రూపాయలు, వాసిబోయిన చంద్రయ్య 500, చెరుకు ఆంజనేయులు 500 రూపాయలు, పెమ్మాడి దుర్గాప్రసాద్ 500 రూపాయలు, దాసరి జయరామ్ 500 రూపాయలు కలిపి మొత్తంగా 11 వేల రూపాయల ఆర్థికసాయం అందజేయడమైనదని అంకెం సురేష్ తెలిపారు. కష్టాల్లోనూ, బాధల్లోనూ ఉన్నవారి ఒక్క కన్నీటి బొట్టునైనా తుడవాలన్నదే సంస్థ ధ్యేయమని అన్నారు. విద్య, వైద్యానికి సంస్థ అధిక మొత్తంలో ఖర్చు చేస్తుందని సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి వారి ధ్యేయం కూడా అదేనని తెలిపారు. సంస్థ ట్రెజరర్ అప్పన హనుమంతరావు మాట్లాడుతూ బాబు వైద్య ఖర్చులకు అధిక మొత్తంలో ఖర్చవుతుందని, సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్థకు 600 రూపాయలు చెల్లించి సభ్యత్వాల నమోదు చేసుకొని సభ్యులుగా చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, చంద్రయ్య, దోసయ్య, శంకర్, గుప్తా, సుబ్బారావు, ఆంజనేయులు, దుర్గాప్రసాద్, మునేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వెంకటేష్, శ్రీనివాస్, జయరామ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి శ్రీవారి సన్నిధిలో టీడీపీ యువగళం



**కొవ్వూరు, పెన్ పవర్, జులై 6:**కొవ్వూరు నియోజకవర్గ కార్యకర్తలకు ఇబ్బందులు తొలగి, అంతా మంచి జరిగి, 2024 ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు గెలిస్తే కాలినడకన తిరుపతిలో శ్రీవారి మెట్లు ఎక్కి శ్రీవారిని దర్శించుకుంటామాని గతంలో మొక్కినట్లు టీడీపీ యువ నాయకులు కాకర్ల సత్యేంద్ర తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలవడం జరిగింది. ఈ నేపథ్యంలో కాలినడకన ఏడుకొండలు ఎక్కి శ్రీవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకోవటం జరిగిందని సత్యేంద్ర తెలియజేశారు. మొక్కు తీర్చుకుని శ్రీవారిని దర్శించుకున్న వారిలో నాదెళ్ల శ్రీరాం, మద్దిపట్ల సురేష్, కూచిపూడి గణేష్, బొల్లిన నాగేంద్ర, బొడ్డు కేశవ, ఉండవల్లి గోపాల్, పత్తిపాటి శశాంక్, అల్లూరి శివ, నిమ్మగడ్డ అశోక్, బొడ్డు చౌదరి, కొడవటి రవి కుమార్, దొంగ రామకృష్ణ, ఇడుపుగంటి సుబ్బారావు ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు



**వై రామవరం, పెన్ పవర్,జులై 6 :** ఏజెన్సీలోని సెలయేర్ల నుండి వంతెనల దగ్గర ఇసుక తవ్వకాలు చేయరాదనే నిబంధనలు ఉన్నాయని,వీటిని భేకాతర్ చేస్తూ ఆక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారనిస్థానికుల ఆరోపిస్తున్నారు.

సెలయేర్లపై ఉన్నా వంతెనల దగ్గర నిబంధనల ప్రకారం రెండు వైపులా 500 మీటర్లు దాటిన తర్వాతే ఇసుక తవ్వకాలు చేయలనే నిబంధనలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. గతంలో ఈ విషయమై ట్రాక్టర్ల యజమానులకు పోలీసులు,రెవెన్యూ,ఆర్ అండ్ బి అధికారులతో కౌన్సిలింగ్ ఇప్పించిన సంగతి అందరికీ తెలిసిందే. కానీ ట్రాక్టర్ల యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి ఏదేచ్ఛగా వంతెన పరిసరాలలోనే ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, దీనివల్ల వంతెన కోతకు గురైయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాక్టర్ల యజమానులు నిబంధన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుచున్నారు.

# ఉపాధిపనులపై అవగాహన కల్పించుకోవాలి



కరప, పెన్ పవర్, జూలై 06:గ్రామంలోని ఉపాధికూలీలందరికీ పనులు కల్పించడం జరుగుతుందని తెలిపి, ఉపాధిపనులపై అందరూ అవగాహన కల్పించుకోవాలని ఏపీఓ జీవీ రమణకుమార్ తెలిపారు. పెనుగుదురు గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపాధికూలీలు, ఫీల్డు అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులన్నీ పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈఆర్థికసంవత్సరం కొత్తగా 20 పనులు మంజూరు అయ్యాయని, డిమాండ్ ప్రకారం ఉపాధికూలీలతో పనులు చేయించడం జరుగుతుందన్నారు. మరో 10 పనులకు ఎస్టిమేట్లువేసి, పంపుతున్నామని ఏపీఓ తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ కె.ప్రకాష్ మాట్లాడుతూ కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రోజువారీ వేతనం రూ 300 లు రావాలంటే ఏయే పనులు, ఏకొలతల ప్రకారం చేయాలో వివరించి, ఉపాధికూలీలకు అవగాహన కల్పించారు. మండల జనసేనఅధ్యక్షుడు బండారు మురళి, గ్రామకమిటీ అధ్యక్షుడు జి. నానిబాబు, పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి మాచర్రావు, డి. వీరబాబు, టి.సత్యనారాయణ, జి.భవానీ, జీవీ రమ్య, వీఆర్వో ఎం. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో నిత్య దీపారాధన జరగాలి



గోకవరం, పెన్ పవర్, జులై 06: గ్రామాలలో ఉన్న దేవాలయలలో నిత్యం పూజా కార్యక్రమాలు, దీపారాధన జరిగితే ఆ ఊరు ఎప్పటికీ పాడి పంటలు, సిరి సంపదలతో సస్యశ్యామలంగా ఉంటుందని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అక్కడ నివసించే ప్రజలు సుఖ, సంతోషాలతో సస్యశ్యామలంగా ఉండాలనే ఆలోచనతో అఖండ దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గోకవరం మండలంలో పలు గ్రామాలలోని దేవాలయాల్లో ప్రతిరోజు పూజా కార్యక్రమాలు, దీపారాధన జరిగే విధంగా ఆయా దేవాలయాలకు ధూప, దీప నైవేద్యాలను అందజేస్తున్నానని కంబాల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నాడు ఇందులో భాగంగా కంబాల శ్రీనివాసరావు సిబ్బంది ఆయా దేవాలయాల్లో పూజ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఐనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధ రావు శర్మ పాల్గొన్నారు.

## వ్యాస జయంతి ఉత్సవాలు ప్రారంభం



గోకవరం పెన్, పవర్, జూలై 06 : మండలంలో వీరలంకపల్లి గ్రామంలో వ్యాస జయంతి ఉత్సవాలను సనాతన ధర్మ ప్రబోధనా స్వచ్ఛంద సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో వాడవాడల ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని వ్యాసమహర్షిని భక్తిశ్రద్ధలతో అర్చించి విష్ణు సహస్రనామ పారాయణ చేశారన్నారు. అల్పాయిష్కుడు అల్ప బుద్ధియుతుడు అనారోగ్యవంతుడు అయినటువంటి కలియుగ మానవుడు సులువుగా తరించుటకు కావలసిన ఉపాసన మార్గాలను జ్ఞాన మార్గాలను వాంగ్మయం రూపంగా అందించిన జ్ఞాన స్వరూపుడు జగద్గురు స్వరూపుడు వ్యాస మహర్షి అని కలియుగ మానవ సమాజానికి ఇంతటి ఉపకారం చేసిన వ్యాసుని జయంతి వాడవాడలా జరుపుకోవడం అనేది మానవుని ప్రధాన కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పాల శ్రీదేవి, సుంకర రాణి, నంగిరెడ్డి లక్ష్మి, మేడిద రమాదేవి, మద్దూరి పార్వతి, పూసల లక్ష్మీదేవి, పూసల కళ్యాణి, దేవన వీరలక్ష్మి, వల్లపుశెట్టి బుజ్జి, వెలిశెట్టి నాగసుధ, సుంకర త్రిమూర్తులు, లక్ష్మి, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవ స్వామికి విరాళం



ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 6:ర్యాలి గ్రామంలో వెలసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం ఈ ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి దేశాల నుండి కూడా భక్తులు తరలివచ్చి ఆ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందుతారు. శనివారం స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులు స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు అనంతరం
గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన జగన్నాధం మాధవ కిరణ్ స్వామి వారి అన్నదాన పథకమునకు 12,500 రూ విరాళంగా సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించగా ఈవో బీ.కృష్ణ చైతన్య స్వామి వారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రాలతో సత్కరించారు.

## బిజెపి ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు.





ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6: స్థానిక షిరిడి నగర్ బిజెపి కార్యాలయంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బిజెపి శ్రేణులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ప్రముఖ జాతీయవాద నేతలలో ముఖ్యుడని,1951 సంవత్సరంలో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ,హిందూ జాతీయ వాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడు.అంతేకాకుండా హిందూ మహాసభ,రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుడైన ముఖర్జీ జన సంఘ్ ని స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందాడని అన్నారు.

అలాగే పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రెడ్డిలోవరాజు,కృష్ణారావు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. మండలంలో యర్రవరం గ్రామంలో కూరాకుల రాజా ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో గట్టెం వెంకటరమణ, బంధం అనిల్ కుమార్,బండారు సూరిబాబు,గొడుగు నల్లబ్బాయి పెదబాబు,దువ్వ శివాజీ,అనిల్ వీరబాబు,వెంకట్రావు,థామస్ తదితర కార్యాలయ సిబ్బంది, బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మాజీ ఉపప్రధాని జగజ్జీవన్‌ం వర్ధంతికి శ్రద్ధాంజలి



కరప, పెన్ పవర్, జూలై 06:మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్ రాం 37వ వర్ధంతి నిర్వహించి, ప్రజలు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కరప, నడకుదురు, పెనుగుదురు, వలసపాకల, జెడ్. భావారం, కూరాడ తదితర గ్రామాల్లోని జగజ్జీవన్‌ం విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. కరపలో టీడీపీ జిల్లా ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చాట్ల ఇమ్మాన్యుయేలు ఆధ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్సీ ఎదురుగా ఉన్న మాజీఉప ప్రధాని జగజ్జీవన్ రాం విగ్రహానికి ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నేటి యువత బాబూజగజ్జీవన్రాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎస్సీనాయకులు రాయి చిన్నా, దార్ల శ్రీను, తాతపూడి శ్రీనివాసరావు, ఉందుర్తి ప్రకాషరావు, మంచాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 6:భారత ఉప ప్రధాని, దళిత జనోద్ధారకుడు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి శనివారం పైడిమెట్ట జగ్జీవన్ రామ్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా పైడిమెట్ట తెలుగుదేశం పార్టీ నాయకులు కొప్పాక కోట్నిస్, ఏపిటిఎఫ్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు, జగ్జీవన్ రామ్ సమాఖ్య అధ్యక్షుడు దేవరపల్లి రమేశ్, గ్రామ పెద్దలు కొల్లి దుర్గారావు, కొప్పాక ఆంటోని రాజు, కొప్పాక పోసియ్య, జొన్నకూటి కిషోర్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఎన్నో కేంద్ర మంత్రిత్వ శాఖలను సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. దళితుల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించిన ఘనత ఆయన సొంతమని చెప్పారు. ఉప ప్రధానిగా కూడా ఆయన దేశ ప్రజలకు సుపరిచితులే అన్నారు. నేటి తరం ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి యువత రాజకీయాల్లో ప్రవేశించి జగ్జీవన్ రామ్ ఆశయాలను అందిపుచ్చుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పైడిమెట్ట జగ్జీవన్ రామ్ యూత్ సభ్యులు కొల్లి చినబాబు, అఖిల్, సునిల్, గెడ్డం గణేష్ తదితరులు ఉన్నారు.

## ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు పంపిణి



పెనుమంట్ర, పెన్ పవర్,జులై 06:మండల మార్టేరు పశు వైద్యశాలలో శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డా.వాకాణి ప్రసాద్ మాట్లాడుతూ తమ పశువైద్యశాల పరిధిలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. వ్యాక్సిన్ ఇంకా వేయించుకొని యజమానులు ఈ నెల 15వ తేదీలో సమీప వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తమనం పూడి శ్రీనివాస రెడ్డి, కొనాల శ్రీనివాస రెడ్డి, కొనాల ఆచారి, తేతలి సోమి రెడ్డి మరియు పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కొండయ్యదొర పేరు మీద శాశ్వత కార్యక్రమం చేపట్టాలి





గండేపల్లి, పెన్ పవర్, జూలై 6: టిడిపి నేత కందుల కొండయ్యదొర పేరుమీదుగా మండలంలో ఏదోఒక శాశ్వత కార్యక్రమానికి ప్రభుత్వ పరంగాను, కుటుంబ పరంగాను చేపట్టాలని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. శనివారం కందుల కొండయ్య దొర 4వ వర్ధంతిని మురారి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ హాజరై మాట్లాడుతూ 1987 నుంచి టిడిపిలో ఉన్నారని కొండయ్య దొర ఉన్నంతకాలం గండేపల్లి మండలంలో టిడిపిను ఢీకొట్టిన వారు లేరన్నారు. మండలంలో అన్ని గ్రామాల ప్రజలకు ఆర్థికంగా, పార్టీ పరంగా మనో ధైర్యాన్ని ఇచ్చిన వ్యక్తి కొండయ్య దొర అని కొనియాడారు. కందుల కొండయ్య దొర సోదరుడు కందుల చిట్టిబాబు మాట్లాడుతూ అన్నయ్యకు పది మందికి సాయం చేయడం, సేవా కార్యక్రమాలు చేయడం ఇష్టమని ప్రతీ ఏటా ఈ సేవా కార్యమాలు కొనసాగిస్తామని అన్నారు. అన్నయ్య ఉన్నంత వరకు తెదేపా పార్టీ కి జ్యోతుల నెహ్రూ విజయానికి పాటు పడ్డామని, ఒక నొక సమయంలో జగ్గంపేట తెదేపా ఇంచార్జిగా పనిచేసారని అన్నారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గా , రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్, సివిల్ సప్లై డైరెక్టర్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులుగా పని చేసిన వ్యక్తి కొండయ్య దొర అని అన్నారు. ఈ సందర్భంగా మురారి గ్రామంలో తెదేపా పార్టీ కార్యాలయం వద్ద ఉన్న కొండయ్యదొర విగ్రహానికి, బ్రహ్మల గుడి వద్ద ఉన్న విగ్రహానికి నవీన్ కుమార్, కొండయ్య దొర కుటుంబ సభ్యులు చిట్టిబాబు, విజయ్, వినయ్ లు నివాళులు అర్పించిన అనంతరం గ్రామంలోని 400 మంది పింఛను మహిళకు, వృద్దులకు చీరలు, స్వీట్ బాక్సలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, తెదేపా నాయకులు కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, జాస్తి వసంత్, కంటే సురేంద్ర, , సుంకవిల్లి రాజు, ఉండవెల్లి బుల్లి రాజు మురారి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఆర్థిక సహకారంతో రామయ్యపాలెం రోడ్డుకు మరమ్మత్తులు





గండేపల్లి, పెన్ పవర్, జూలై 6 : మండలంలోని రామయ్యపాలెం గ్రామం మీదుగా గండేపల్లి నుండి కనుపూరు వెళ్ళు ఆర్ అండ్ బి రోడ్డు రామయ్యపాలెం గ్రామ మధ్యలో పెద్ద పెద్ద గుంతల పడి వర్షపు నీరు నిలిచిపోతుంది. దీంతో రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు గుంతల్లో నిల్వ ఉండిపోవడంతో గోతులు కనిపించక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రామయ్యపాలెం గ్రామ సర్పంచ్ మైలవరపు వెంకటలక్ష్మి, శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో క్వారీ బూడిదతో గుంతలను పూడ్చుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ను గ్రామస్తులు అభినందిస్తున్నారు. రోడ్డు అభివృద్ధి చేస్తుండడం పై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గృహ ఆధారిత విద్యా కేంద్రం నిర్వహణలో సునిశితంగా వ్యవహరించాలి: కోఆర్డినేటర్ నాగేశ్వరరావు.





ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6: గృహ ఆధారిత విద్యా కేంద్రాల నిర్వహణలో సునిశితంగా వ్యవహరించాలని జిల్లా కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గృహ ఆధారిత విద్యా కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన శనివారం చేశారు. కేంద్రాలను పరిశీలించిన ఆయన ఆ విద్యా కేంద్రంలో రికార్డులను పరిశీలించి పిల్లల తల్లిదండ్రులతో పిల్లల ఆక్టివిటీస్ గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పట్ల తల్లిదండ్రులు ఓర్పుతో సహనం పాటించాలని, అధికారులు సునిశితంగా పిల్లలతో వ్యవహరించాలన్నారు. అధికారులకు, పిల్లలు తల్లిదండ్రులకు పిల్లల ప్రవర్తన పట్ల జాగురకతతో వ్యవహరించాలని, పిల్లల పరిస్థితిని ఎప్పటికప్పుడు అర్థం చేసుకోవాలని, వారికి అనుగుణంగానే వ్యవహరించాలన్నారు. ఈ గృహ ఆధారిత విద్యా కేంద్రాల సందర్శనం లో ఎంఈఓ మీ అబ్బాయి, విద్యా కేంద్రాల నిర్వహకులు ,సిబ్బంది ఉన్నారు.

# సచివాలయం ఆకస్మిక తనిఖీ

- కార్యదర్శులపై కమిషనర్ అసహనం
- ముగ్గురిపై చర్యలకు ఆదేశం



**కాకినాడ. పెన్ పవర్ జూలై 6 :**విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు సచివాలయ కార్యదర్శులపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శనివారం ఆయన పరలోపేట పాములాల తూము సమీపంలోని 10-బి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సచివాలయ ఉద్యోగుల హాజరు, పనితీరు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించారు. అక్కడి ప్లానింగ్ సెక్రటరీ డ్రెస్ కోడ్ ను ఉల్లంఘించి విధులకు హాజరు కావడంతో షోకాస్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే కార్యాలయంలో అందుబాటులలోని ఎమినిటీ సెక్రటరీకి కూడా షోకాజ్ నోటీస్ ఇస్తున్నట్లు తెలిపారు. పన్నుల వసూళ్లలో వెనుకబడ్డ సచివాలయ అడ్మిన్ కు మెమో ఇవ్వాలని నిర్ణయించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని, అందుకు విరుద్ధంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏమాత్రం ఉపేక్షించబమని కమిషనర్ వెంకటరావు స్పష్టం చేశారు.

# జేఎన్టీయూ కాకినాడలో ఏక్ పేడ్ మా కే నామ్ అభియాన్




**కాకినాడ.పెన్ పవర్ జూలై 6 :**జెఎన్టియుకె ప్రాంగణంలో శనివారం ఉదయం ఏక్ ఫెడ్ మా కే నామ్ : అబియాన్ కార్యక్రమంలో భాగంగా జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎస్ఎస్ సెల్ కో - ఆర్డినేటర్ డా.జి.శ్యామకుమార్ విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ సెల్ కో - ఆర్డినేటర్ డా . జి . శ్యామ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణం అంతా మొక్కలను నాటి పచ్చదనంతో ఉండేలా చేస్తామన్నారు .ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను నాటి రాష్ట్రం దేశం పచ్చదనంతో సుభిక్షంగా ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో యుసిఇకె ఎన్ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె . రమణాజీ , ఎం.వి.ఎస్వి.కిరణ్మయి , డా.పి. వీరలక్ష్మి , హార్టికల్చరిస్ట్ శశికళ ఫిజికల్ డైరెక్టర్లు , ఎన్ఎన్ఎస్ వాలంటీర్లు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# డ్రైనేజీని పరిశుభ్రం చేయండి

- అధికారులకు కమిషనర్ ఆదేశం



**కాకినాడ.పెన్ పవర్ జులై 6 :**కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేట్ ని ఆనుకుని ఉన్న డ్రైనేజీని పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు అధికారుల ఆదేశించారు. శనివారం అయన ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఇతర అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మెయిన్ డ్రైన్ లో కలిసే ఈ డ్రైనేజీ ని రైల్వే శాఖ సమన్వయంతో పూడికతీత పనులు చేపట్టాలని కమిషనర్ సూచించారు. 47,48 డివిజన్ల ప్రజలకు ఉపయోగపడే ఈ డ్రైనేజీ పనుల విషయంలో అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ కోరారు. రైల్వే అధికారులను సంప్రదించి ఆమోదం తెలిపిన వెంటనే టీఎంఎక్స్ మిషన్ ను వినియోగించి షిల్ట్ తొలగింపు పనులు చేపట్టాలని,ఆ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్తెప్ప నాయుడు తదితరులు ఉన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిరక్షించాలి

యువసేన సభ్యుల వినతి



**గంగవరం ,పెన్ పవర్, జూలై 6:**గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిరక్షణకు కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి, టిడిపి రంపచోడవరం నియోజవర్గ అధ్యక్షుడు విజయభాస్కర్లను స్థానిక యువసేన యువకులు కోరారు. శనివారం గంగవరం మండల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కే సిద్దు ఆధ్వర్యంలో స్థానిక యువసేన యువకులు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని సమర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని యువకులు కోరారు. ఇదే విషయాన్ని మాజీ ఎంపీపీ తీగల ప్రభ స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ తదితరులు పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ పాఠశాల సమస్యను వివరించారు. ఈ నేపథ్యంలో వారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థితిగతులను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిజెపి జనసేన మండల కమిటీ అధ్యక్షలు అర్జున, పోతురాజు, సిద్దు ,మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ,సర్పంచ్ అక్కమ్మ, మాజీ ఎంపిటిసి బుల్లియమ్మ పలు పార్టీల నాయకులు ఉన్నారు.

# రేబిస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ షాన్ మోహన్ సగిలి




**కాకినాడ. పెన్ పవర్ జూలై 6 :**రేబీస్ వ్యాధికి చికిత్స లేనందున రేబీస్ వ్యాధి నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు.

శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవము సందర్భంగా కాకినాడ వెటర్నరి పోలిక్లినిక్ ఆవరణలో నిర్వహించిన ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమము, అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులలో అత్యంత ప్రమాదకరమైన వ్యాధి రేబీస్ వ్యాధి అని అన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేనందున నివారణ ఒక్కటే మార్గమని ఆయన తెలిపారు. రేబీస్ వ్యాధి పట్ల పెంపుడు కుక్కల యజమానులకు విస్తృత అవగాహన కల్పించేలా అధికారులకు కృషి చేయాలి అన్నారు. పెంపుడు కుక్కల యజమానులు అందరు తప్పనిసరిగా తమ కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాను క్రమం తప్పకుండా వేయించాలన్నారు. ఈ సందర్భంగా రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించే నిమిత్తం రూపొందించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్..పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా. ఎస్. సూర్య ప్రకాశ రావు మాట్లాడుతు కాకినాడ జిల్లాలో మొత్తం 32 వేల రేబీస్ వ్యాధి నిరోధర టీకాలు పంపిణి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని ఏరియా వెటర్నరి ఆసుపత్రులు, అన్ని వెటర్నరి డిస్పెన్సరీలలో వ్యాక్సిన్ అందు బాటులో ఉందన్నారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కాకినాడ వెటర్నరి పోలిక్లినిక్ ఉపసంచాలకులు డా.కె. కృష్ణమూర్తి మాట్లాడుతు పశుపక్షాదుల నుండి మానవులకు సంక్రమించే వ్యాధులను జూనాటిక్ వ్యాధులు అంటారన్నారు. లూయిపాశ్చర్ అనే శాస్త్రవేత్త 1885 జూలై 6న రేబిస్ వ్యాధి నిరోధక టీకాను కనిపెట్టి, పిచ్చి కుక్క కాటుకు గురియైన 9 సంవత్సరాల బాలునికి టీకా ఇచ్చి సఫలీకృతం అయ్యారని ఆయన తెలిపారు. ఈ విజయానికి గుర్తుగా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటు న్నామన్నారు. ఈ సందర్భంగా 800 పెంపుడు కుక్కలకు ఏ.ఆర్.వి ఇవ్వడం జరిగిందని, స్మైస్ ఫార్మా కంపెనీ సహకారంతో కుక్కలకు పాములు ముందు, పేలు ముందు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు.కార్యక్రమంలో వెటర్నరి పోలిక్లీనిక్ సహాయ సంచాలకులు, డా.ఎ. వెంకట్రామయ్య, వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ లు కె.రాజేష్ బాబు,డా జి.రవిబాబు,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి నాణ్యత పై ప్రజలనే అడగండి

- కార్యదర్శులకు కమిషనర్ ఆదేశం




**కాకినాడ.పెన్ పవర్ జులై 6 :**ప్రజలకు శుద్ధి చేసిన, స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రతిరోజు 10 నీటి నమూనాలను పరీక్షించాలని, కనీసం 25 మంది గృహ యజమానులను కలిసి మంచినీటి నాణ్యత ను అడిగి తెలుసుకోవాలని ఆయా సచివాలయ ఎమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఆయన ఆనంద్ థియేటర్ సమీపంలోని ఫ్లై ఓవర్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో మంచినీటి సరఫరా లోపాలపై స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలలో ఏమైనా లోపాలు ఉన్నాయా ? అని ఆరా తీశారు. ప్రతిరోజు రెండు పూటలా నీరు సక్రమంగానే వస్తోందని, అయితే కొన్నిసార్లు నీరు రంగు మారడం సహా కొన్ని సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ విక్టోరియా వాటర్ వర్క్స్ ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఫిల్టరేషన్ పై అధికారులతో చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ద్వారా సరఫరా చేస్తున్న మంచినీటిలో ఎటువంటి సమస్యా లేదని, అయితే కొన్నిసార్లు పైప్ లైన్ మరమ్మత్తుల కారణంగా నీటి కాలుష్యం ఎదురవుతుందన్నారు. వీటిని గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఇందులో భాగంగా ఆయా ఎమినిటీ కార్యదర్శులు తమ పరిధిలో స్వయంగా 25 ఇళ్లకు వెళ్లి నీటి నాణ్యత పై నేరుగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతిరోజు 10 శాంపిల్స్ ను పరీక్షించాలని ఆదేశించారు. అలా నిరంతర పర్యవేక్షణ ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన నీటిని అందించగలమని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా ఉండే సచివాలయాల్లో గాని, నగరపాలక సంస్థలోని టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్ కు గాని తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఎం హెచ్ వో డాక్టర్ పృద్విచరణ్, డిఈ బీహెచ్ సుబ్బారావు, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, ఆయా సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

# మందేశ్వర స్వామి ఆలయానికి పోటేత్తిన భక్తులు





**కొత్తపేట, పెన్ పవర్ జూలై6:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు.దేవస్థానంలో శనేశ్వర స్వామికి భక్తులు తైలాభిషేకములు ఘనంగా నిర్వహించారు.అనంతరం దేవస్థానం వారు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం భక్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆలయానికి తైలాభిషేకములు ద్వారా 1లక్షా64వేల815రూపాయలు,అన్న ప్రసాదం విరాళాలుగా 52వేల476రూపాయలు మొత్తం వెరసి 2లక్షల17వేల291రూపాయలు ఆలయానికి ఆదాయం వచ్చినదని సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె. విజయ లక్ష్మి,తెలియజేశారు.

# శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ





**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు ఇరవై వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,78,140 అన్నదాన విరాళాల ద్వారా రూ.52,616, కేశ ఖండన ద్వారా రూ.5,720, తులాభారం ద్వారా రూ. 200, లడ్డు ప్రసాదం ద్వారా రూ.19,620, స్వామి వారి కానుక ద్వారా రూ.10,000, మొత్తం రూ. 2,66,296 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశామని, సుమారు ఐదు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగజీవన్ రామ్

డోకుబుర్ర భద్రం మాస్టారు



**కాకినాడ.పెన్ పవర్ జులై 6 :**స్థానిక జగన్నాధ పురం,ఘాటి సెంటర్ నందు దళిత, గిరిజన,బీసీ, ముస్లిం,క్రైస్తవ వేదిక ఆధ్వర్యంలోబాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు

డోకుబుర్ర భద్రం మాస్టారు మాట్లాడుతూ భారత దేశంలో అత్యంత పిన్న వయస్సు లో క్యాబినెట్ మంత్రి గా బాధ్యతలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.అనేక మంత్రి పదవులు చేపట్టిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.అంతే కాకుండా వ్యవసాయమంత్రిగా ఈయన హరిత విప్లవం తీసుకురావడం, రక్షణ మంత్రిగా ఇండో -పాకిస్తాన్ యుద్ధంలో విజయం సాధించి బంగ్లాదేశ్ ఆవిర్భవించడానికి కారకుడు అయ్యాడని పేర్కొన్నారు.స్వతంత్ర భారత తొలి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి తన మరణం వరకు

సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేయడం, ఉప ప్రధానిగా పనిచేయడం ఈయన యొక్క గొప్పతనానికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన సేవలను స్మరించుకున్నారుఈ కార్యక్రమంలో న్యాయవాది బండి నరేంద్ర, ఆవు పాటి ఉమాశంకర్, సుధాకర్, బోనగిరి బాలభద్రరావు,

షేక్ ఇస్మాయిల్ దైవ కృప ఆటో యూనియన్ సభ్యులు కొమ్ముకురి నాగేశ్వరరావు, పాలేరు కృపానందం,ఏడిద లాజరు తదితరులు పాల్గొని ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు.

## ఎమ్మెల్యే శిరీష దంపతులను సన్మానించిన విద్యాశాఖ అధికారులు



**గంగవరం, పెన్ పవర్, జూలై 6 :**రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, విజయభాస్కర్లను ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏజెన్సీ ఏడు మండలాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే దంపతులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే దంపతులను విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు తాతబ్బాయి దొర మల్లేశ్వరరావు ,మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, సర్పంచ్ కలుముల అక్కమ్మ, టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పాము అర్జున, బిజెపి మండల కమిటీ అధ్యక్షుడు పోతురాజు, జనసేన అధ్యక్షుడు సిద్దు తదితరులున్నారు.

# పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిక్కిన విశ్వేశ్వరరావు**

**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు పెద్దాపురం మండలం జి. రాగంపేట గ్రామంలో బీజేపీ నాయకులు శనివారం అమ్మ పేరిట మొక్క కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, పర్యావరణాన్ని రక్షించుకున్నట్లయితే జీవన విధానానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. అమ్మ పేరుతో ప్రతీ ఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని, తద్వారా తల్లిలాంటి ప్రకృతిని కాపాడుకున్నవారిమౌతామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోతుల వీర ప్రభాకరరావు, ఎస్. ఏసుబాబు, యానాల రాంబాబు, మోటూరి వీరబాబు, అల్లు ప్రసాద్,



జనసేన నాయకులు నానిబోయిన కళ్యాణ్ కుమార్, యర్రవరపు రాజా, టీడీపీ నాయకులు దేవళ్ళ సతీష్, బీజేపీ కార్యకర్తలు బి. సత్తిబాబు, లొల్ల రాము, పామర్తి రాము, పోతాబత్తుల చిన్న, సురేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపాలెంలో ఎరువుల దుకాణాలు తనిఖీ





**కాజులూరు,పెన్‌పవర్, జూలై6:** మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో శనివారం స్పెషల్ కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ వారు విత్తనాలు, ఎరువులు ,పురుగు మందులు దుకాణాలు తనిఖీ చేశారు.ఇటీవల ప్రభుత్వం ప్రత్యేక స్క్వాడ్ టీములను ప్రతి జిల్లాకు పంపించడంతో ఈ బృందం గొల్లపాలెంలోని విజయలక్ష్మి ఏజెన్సీస్ పురుగు మందు షాపును తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయ అధకారి వి.అశోక్ మీడియాకు తెలిపారు.నాణ్యమైన పురుగు మందులు,ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు.ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా పురుగు మందు దుకాణాలు నడపాలని షాపు యజమానులకు తెలియజేశారు.దీనిలో భాగంగా కాకినాడ జిల్లా కు కె. త్రినాథ స్వామి డీడీఏ, డీఆర్‌సీ, శ్రీకాకుళం జిల్లా, విజిలెన్స్ డిపార్ట్మెంట్ నుండి డివివి సతీష్ కుమార్,ఐఓపీ శ్రీకాకుళం జిల్లా నుండి కాకినాడ జిల్లాకు రావడం జరిగిందని ఆయన వివరించారు.ఈనేపథ్యంలో విజయ లక్ష్మి ఏజెన్సీస్ గొల్లపాలెం నందు విత్తనాలు, ఎరువులు షాపును తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈతనిఖీల్లో వీరితోపాటు, పెదపూడి వ్యవసాయ అధికారి టి.వి.ఆర్ మనిదీప్ తదితరులు పాల్గొన్ఆనరు.

# ఘనంగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని భారతీయ జనతా పార్టీ పెద్దాపురం పట్టణ అధ్యక్షుడు అల్లు ప్రసాద్ అన్నారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 122వ జయంతి వేడుకలను పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అల్లు ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశాన్ని విడగొట్టే 370 జీవోను వ్యతిరేకిస్తూ పోరాటం చేసి భారతసమాఖ్య విఘాతాన్ని అడ్డుకునే ప్రయత్నంలో ప్రాణాలు వదిలిన మహానాయకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని, ఆయన జీవితం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నాడు శ్యాంప్రసాద్ ముఖర్జీ కన్న కలలను నేటి ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారని గుర్తు చేశారు. భారతదేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని, ఒకే విధానం ఉండాలని ఆకాంక్షించిన గొప్ప జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు దుర్గా మోహనరావు, పెద్దాపురం నియోజకవర్గ కోకన్వీనర్ చెరుకూరి రవికృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి యాళ్ళ నాని, మామిడాల రాము, గరగ శేషగిరి, సర్వసిద్ది సతీష్, పొన్నూరు మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణత అభియాన్ ద్వారా మండలం అభివృద్ధి







- రంపచోడవరం శాసన సభ్యురాలు శిరీష దేవి

**గంగవరం, పెన్ పవర్, జూలై 6:**నీతి అయోగ్ ఆధ్వర్యంలోని సంపూర్ణత అభియాన్ ద్వారా మండలం అభివృద్ధి బాటలో నడపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న నీతి అయోగ్ లో భాగంగా సంపూర్ణత అభియాన్ నీతి అయోగ్ మండలంగా గంగవరం మండలాన్ని మండలాన్ని ఎంపిక చేయడం హర్షించదగిన విషయం అని ఎమ్మెల్యే అన్నారు. శని వారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో బి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నీతి అయోగ్ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవితో పాటు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆరోగ్యం,పోషకాహారం, సంక్షేమం పై ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. రంపచోడవరం డివిజన్లోని అభివృద్ధికి నోచుకోని మారేడుమిల్లి, గంగవరం, వై రామవరం మండలాలను నీతి అయోగ్ ఎంపిక చేసిందని సంపూర్ణ అభియాన్ ద్వారా మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రంపచోవడం నియోజకవర్గం లో మూడు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. జడ్పిటిసి సభ్యురాలు బేబీ రత్నం , వైస్ ఎంపీపీలు రామ తులసి గంగాదేవి, స్థానిక సర్పంచ్ కే అక్కమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ వైస్ ఎంపీపీ కనిగిరి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షులు పాము అర్జున, వైద్యాధికారి భావన, ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్ లక్ష్మి, వ్యవసాయ అధికారి విశ్వనాథ్ తదితరులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముందుగా విద్యార్థినీలతో ర్యాలీ నిర్వహించి, స్థానిక వై జంక్షన్ లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అందరితో పరిశుభ్రత సంపూర్ణ ఆరోగ్యం పై ప్రతిజ్ఞ చేయించారు. నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్ కార్యక్రమం దేశంలో 500 బ్లాక్ లు ఎంపిక కాగా, రాష్ట్రంలో 15 మండలాలు ఎంపిక అయ్యాయని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు మండలాలు ఎంపిక అయ్యాయని మండల కోఆర్డినేటర్ ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను ఎమ్మెల్యే పరిశీలించారు. పోషకాహార ప్రదర్శనశాలను ఎమ్మెల్యే ప్రారంభించి గర్భిణీలకు సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. అలాగే ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన బాలికలకు బహుమతి ప్రధానం చేశారు .ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు విజయ భాస్కర్, నీతి అయోగ్ ప్రతినిధి హేమాధురి, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు జనసేన మండల అధ్యక్షుడు కే సిద్ధు, బిజెపి మండల అధ్యక్షుడు శారపు పోతురాజు, ఎంపీటీసీలు కనక లక్ష్మి, పండ ఆదినారాయణ, సర్పంచులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వెంకటేశ్వర్లు దొర, పాపారావు, భాను ప్రకాష్ ,బుల్లియమ్మ, మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. .






# ఏడువారాల వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



- శని వారం ఒక రోజు స్వామివారి ఆదాయం 34,01,965 రూ,

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 6 :** ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల అనే నానుడి తో తెలుగు రాష్ట్రాల నుండి వేలాది గా భక్తుల తరలివచ్చి ఆ చందన వెంకటేశ్వర స్వామి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున ఆలయ సన్నిధిలో స్వామి వారి ఐశ్వర్య లక్ష్మి హెూమం స్వామివారి మేలుకొలుపు సేవ, అలంకరణోత్సవం ఆలయారుచూల అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి మొదటి హారతితో భక్తులకు దర్శనం కల్పించారు. దూరప్రాంతాల నుండి కాలినడక వచ్చే భక్తులు శుక్రవారం సాయంత్రానికి ఆలయ సన్నిధికి చేరుకుని వేకువ జామునే గౌతమీ గోదావరి నదిలో తన స్నానలను ఆచరించి సాంప్రదాయమైన దుస్తులతో స్వామివారి దర్శనానికి ఆలయం మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణాలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లో ఉన్న భక్తులకు మంచినీరు సరఫరా చిన్నపిల్లలు ఉన్నవారికి పాలు పంపిణీ ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం ఒక్కరోజే స్వామివారి ఆదాయం 34,01,965 ఆలయ ఉప కమిషనర్ బి. కిషోర్ కుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఆత్రేయపురం ఎస్సై ఎస్. శ్రీనివాస్ తన సిబ్బందితో పర్యవేక్షించారు.






# మరిడమ్మను దర్శించుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ చైర్మన్



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 6 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ చైర్మన్ మాంథాత సీతారామ్మూర్తి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వారికి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి ఆశీర్వచన మండపంలో అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం పలికి శేషవస్త్రం, అమ్మవారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధచూపాలి

**రంపచోడవరం శాసన సభ్యురాలు శిరీష దేవి**





**గంగవరం ,పెన్ పవర్, జూలై 6:**ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి సూచించారు. శనివారం స్థానిక ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు .ఈ సందర్భంగా పాఠశాలలోని పలు విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని ఇవ్వాలని, ఆరో వాటర్ ప్లాంట్ ను మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు విజయ భాస్కర్, ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, టిడిపి, బిజెపి, జనసేన అధ్యక్షులు అర్జున ,పోతురాజు, సిద్దు ,సర్పంచ్ కలుముల అక్కమ్మ తదితరులు ఉన్నారు.

# సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

**ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు**





**గంగవరం ,పెన్ పవర్, జూలై 6:**విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు విభాగాలను పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు .అలాగే వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ 2 మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి డిప్యూటీ వార్డెన్ లావణ్య తదితరులు ఉన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com